# హాజరుశాతం పెంపునకే 'అల్పాహారం'

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి
- సోన్‌లో కలెక్టర్ వరుణ్‌రెడ్డితో కలిసి సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకం ప్రారంభం



సోన్ : ప్రాథమిక పాఠశాలలో అల్పాహార పథకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్

సోన్, అక్టోబర్ 6 : విద్యార్థుల్లో పోషకాహార లోపాన్ని నివారించి హాజరుశాతం పెంచేందుకే సీఎం కేసీఆర్ 'అల్పాహార' పథకాన్ని తీసుకువచ్చారని రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కలెక్టర్ వరుణ్‌రెడ్డితో కలిసి 'సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని' శుక్రవారం ప్రారంభించి విద్యార్థులకు వడ్డించిన తర్వాత వారితో కలిసి టిఫిన్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకునే పిల్లలకు పోషకాహారం అందించడం, డ్రాపౌట్లను తగ్గించడం, హాజరుశాతం పెంచడానికి ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతోందని అన్నారు. ప్రతిరోజూ మెనూ ప్రకారం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం పెడుతారని పేర్కొన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి పాఠశాల, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అలాగే 'మనఊరు– మన బడి' కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో మౌలిక సదుపాయలు కల్పించామన్నారు. గతేడాది నిర్మల్ జిల్లా పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రంలోనే మొదటిస్థానంలో నిలవడం గర్వంగా ఉందన్నారు. అలాగే ట్రిపుల్‌ఐటీకి జిల్లా నుంచి విద్యార్థులు ఎంపికయ్యారని, ఈ ఏడాది కూడా అదే స్ఫూర్తితో 200 మంది వరకు బాగా మార్కులు తెచ్చుకొని సీట్లు సాధించాలని కోరారు. సర్కారు బడుల్లో మంచి ఫలితాలు వస్తుండడంతో అడ్మిషన్ల సంఖ్య కూడా పెరుగుతుందన్నారు. విద్యార్థులు బాగా చదివి మంచి మార్కులు సాధించాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి సూచించారు. అనంతరం గృహలక్ష్మి పథకం కింద మంజూరైన పత్రాలను లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ జీవన్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కృష్ణప్రసాద్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ టీ వినోద్‌కుమార్, ఆత్మ చైర్మన్ గంగారెడ్డి, రైతుబంధు సమితి మండల కన్వీనర్ మహేందర్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ శ్రీకాంత్‌యాదవ్, పీఆర్టీయూ అధ్యక్షుడు నరేంద్రబాబు, ఎస్టీయూ సంఘ అధ్యక్షుడు గజేందర్, తహసీల్దార్ శివరాజ్, ఉప సర్పంచ్ దాసరి రాజేశ్వర్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, దాసరి శ్రీనివాస్, అంబేకర్ ప్రసాద్, ఆరె రాము, శానం గంగాధర్, ప్రధానోపాధ్యాయులు ఆరాధన, సురేందర్, కొత్తకాపు రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

### సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత..

దిలావర్‌పూర్, అక్టోబర్ 6 : మండలంలోని కాల్వ గ్రామానికి చెందిన భూమవ్వకు సీఎం సహాయ నిధి కింద మంజూరైన రూ.30 వేల చెక్కును మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి మండల నాయకులతో కలిసి బాధితురాలికి అందించారు. కార్యక్రమంలో కాల్వ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ చైర్మన్ పూజారం మహేశ్, సహకార సంఘం చైర్మన్ పీవీ రమణరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కొమ్ముల చిన్న దేవేందర్‌రెడ్డి, నాయకులు పాల్దే అనిల్, చిన్నయ్య, తదితరులు ఉన్నారు.

### పట్టణాభివృద్ధే ధ్యేయం..

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 6 : రూ.200 కోట్ల నిధులతో పట్టణంలో అభివృద్ధి పనులు చేపట్టామని మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని శాంతినగర్ క్రాస్ రోడ్డు నుంచి దివ్య నగర్ కాలనీ వరకు రూ.40 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులకు శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో పట్టణాన్ని మరింత అభివృద్ధి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, అల్లోల మురళీధర్ రెడ్డి, అల్లోల తిరుపతి రెడ్డి, నాయకులు కొండ శ్రీధర్, ముత్యం రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాజు ఉన్నారు.

# బీఆర్ఎస్‌కే మద్దతు

- అర్లి (కే) గ్రామస్తుల తీర్మాణం
- దేశంలో ఎక్కడా లేని పథకాలు: ఎమ్మెల్యే జోగు రామన్న
- గ్రామాన్ని దత్తత తీసుకుంటా : బోథ్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్



తలమడుగు : అర్లి (కే) లో బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేస్తామని తీర్మానం చేసి ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామస్తులు

తలమడుగు, అక్టోబర్ 6 : బీఆర్ఎస్‌కే మా మద్దతు అంటూ మండలంలోని అర్లి(కే) గ్రామస్తులు శుక్రవారం తీర్మానం చేసి ప్రతిజ్ఞ చేశారు. గ్రామస్తులు శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశానికి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న, బోథ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగు రామన్న సమక్షంలో దాదాపు 200 మంది యువకులు, మహిళలు బీఆర్ఎస్‌లో చేరారు. ఒకే పార్టీ ఒకే గ్రామం అనే నినాదంతో తమ గ్రామంలో కొంత అభివృద్ధి జరగకపోయిన సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్‌పై నమ్మకంతో గ్రామస్తులంతా కూర్చొని బీఆర్ఎస్ పార్టీ వెంటే ఉంటామని నిర్ణయించుకున్నామన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ ప్రజలంతా గ్రామం అభివృద్ధి చెందాలన్న ఉద్దేశంతో బీఆర్ఎస్‌కు ఓటు వేస్తామని తీర్మానం చేయడం అభినందనీయమన్నారు. గ్రామంలోని సమస్యలను ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్‌తో కలిసి సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని హామీ నిచ్చారు. అంతకుముందు వారు బరంపూర్ నుంచి గ్రామం వరకు 300 బైక్‌లతో ర్యాలీగా గ్రామానికి చేరుకోగా గ్రామస్తులు, బీఆర్ఎస్ కార్యకర్తలు, మహిళలు మంగళహారతులతో వారికి ఘనంగా స్వాగతం పలికారు. బోథ్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ మాట్లాడుతూ ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత గ్రామాన్ని దత్తత తీసుకొని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. అనిల్ జాదవ్ ఎమ్మెల్యే నామినేషన్ ఖర్చు కూడా తామే భరిస్తామని యువకులు జిల్లా అధ్యక్షుడికి తెలిపారు. గ్రామంలో రామాలయం నిర్మాణానికి గ్రామానికి చెందిన మైస మోహన్ తనకున్న మూడెకరాల్లో అరెకరం భూమిని రామాలయం నిర్మాణానికి దానం చేయడం అభినందనీయమన్నారు. అనంతరం ఆయనను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో టీఎస్‌డీడీసీ మాజీ చైర్మన్ లోక భూమారెడ్డి, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తోట వెంకటేశ్, సర్పంచ్ నారు కిష్టన్న, నాయకులు ముడుపు కేదారేశ్వర్ రెడ్డి, గ్రామస్తులు అశోక్ రెడ్డి, సురేందర్ రెడ్డి, ఆనంద్, వెంకట్ రెడ్డి, సత్యనారాయణ, కృష్ణ, రాజు పాల్గొన్నారు.

### కులమతాలకతీతంగా పాలన

బేల, అక్టోబర్ 6 : కులమతాలకు అతీతంగా సీఎం కేసీఆర్ పాలన సాగిస్తున్నారని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. మండలకేంద్రంలో రూ. 30 లక్షలతో నిర్మించనున్న మరాఠ సంఘం భవనం పనులను మండల నాయకులతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం బేల మార్కెట్ యార్డు నుంచి ట్రాక్టర్లతో డీజే పాటల నడుమ భారీ ర్యాలీ తీశారు. అలాగే ప్రైవేట్ గార్డెన్‌లో యువకులకు స్పోర్ట్స్ కిట్లను అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలవ్యాప్తంగా 66 కిట్లు పంపిణీ చేశామని, క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే మండలంలోని ప్రభుత్వ స్థలంలో దాదాపు రూ. 5 కోట్లతో మినీ స్టేడియం నిర్మాణం చేపడుతామ హామీనిచ్చారు. అనంతరం ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్నకు మరాఠ సంఘం ఆధ్వర్యంలో పూలమాల వేసి శాలువా , మెమోంటోతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రావుత్ మనోహర్, బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు గంభీర్‌ఠాక్రే, ఆడనేశ్వర్ ఫౌండేషన్ చైర్మన్ సతీశ్‌పవార్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కల్యాం ప్రమోద్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు దేవన్న, వట్టిపెల్లి ఇంద్రశేఖర్, తన్వీర్‌ఖాన్, జక్కుల మధూకర్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు , మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, ఆయా గ్రామాల యువకులు తదితరులు పాల్గొన్నారు.



నార్నూర్‌లో మహిళలకు బతుకమ్మ చీరెలు పంపిణీ చేస్తున్న జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్

# అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయం

- ఆదిలాబాద్ జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్
- మహిళలకు బతుకమ్మ చీరెలు, యువతకు స్పోర్ట్స్ కిట్ల పంపిణీ

నార్నూర్,అక్టోబర్ 6 : అన్ని వర్గాల సంక్షేమమే సర్కారు ధ్యేయమని ఆదిలాబాద్ జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మహిళలకు బతుకమ్మ చీరెలు, యువకులకు స్పోర్ట్స్ కిట్ల పంపిణీని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు బతుకమ్మ పండుగను సంతోషంగా జరుపుకోవాలన్నారు. స్వరాష్ట్రంలో ఇంటింటా సంక్షేమ పథకాలు లబ్ధిదారులు ఉన్నారన్నారు. ప్రతిపక్షాల నాయకుల మాటాలు నమ్మవద్దని, వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని మళ్లీ గెలిపించాలని కోరారు. అలాగే 'నీతి ఆయోగ్' కు నార్నూర్ మండలం ఎంపికవ్వడం ఆనందంగా ఉందన్నారు. అంతకుముందు 'నీతి ఆయోగ్'కి నార్నూర్ మండలం ఎంపికైన తరుణంలో ఢిల్లీకి వెళ్లిన సర్పంచ్‌లు,అధికారులు ప్రజాప్రతినిధులను జడ్పీ చైర్మన్ శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ కనక మోతుబాయి, వైస్ ఎంపీపీ జాదవ్ చంద్రశేఖర్, ఎంపీడీవో కావల రమేశ్, ఏవో గిత్తే రమేశ్, ఏపీఎం మైస రమేశ్, సర్పంచ్‌ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్, సహకార సంఘం ఇన్‌చార్జి చైర్మన్ ఆడే సురేశ్, ఆయాశాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్య కర్తలు, మహిళలు పాల్గొన్నారు.

# మన పథకాలు దేశానికే ఆదర్శం

- ముథోల్ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి
- అదనపు గదుల నిర్మాణానికి భూమిపూజ



భైంసా : మార్కెట్ యార్డులో అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విఠల్ రెడ్డి

భైంసా, అక్టోబర్ 6 : మన పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ముథోల్ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి అన్నారు. పట్టణంలోని మార్కెట్ యార్డులో రూ. 2.30 కోట్లతో చేపడుతున్న అదనపు గదుల నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. పట్టణంలో ఇప్పటికే ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. త్వరలోనే మార్కెట్ కార్యాలయం ఎదుట రైతు, ఎడ్ల బండి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేశ్ బాబు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జేకే పటేల్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణ, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు ఫారూక్ హైమద్, డైరెక్టర్ తోట రాము, నగేశ్, మార్కెట్ కార్యదర్శి అడెల్లు ఉన్నారు.

### గురుకుల కాలేజీ భవనం పనులకు ..

ముథోల్, అక్టోబర్, 6 : మండలకేంద్రంలో రూ. 5 కోట్లతో నిర్మిస్తున్న తెలంగాణ గిరిజన గురుకుల కళాశాల నూతన భవన నిర్మాణానికి ఎమ్మెల్యే విఠల్ రెడ్డి శుక్రవారం భూమి పూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చదువుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం గురుకులాలు ఏర్పాటు చేస్తున్నదని చెప్పారు. పాఠశాలలో నీటి సమస్య ఉందని ప్రిన్సిపాల్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కళాశాల మంజూరు చేసిన సీఎం, రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, మంత్రి ఇంద్రకరణ్ రెడ్డికి గ్రామస్తుల తరపున ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను కళాశాల సిబ్బందితో పాటు ప్రజా ప్రతినిధులు శాలువాతో ఘనంగా సన్మానించారు.

### ఎస్సీ కమ్యూనిటీ హాల్ మంజూరు..

మండలంలోని రువ్వి గ్రామంలో రూ. 2.50 లక్షలతో నిర్మించనున్న ఎస్సీ కమ్యూనిటీ హాల్ మంజూరు ప్రొసీడింగ్ కాపీని గ్రామస్తులకు అందజేశారు. ఎంపీపీ అయేషా అఫ్రోజ్ ఖాన్, ఎంపీడీవో సురేశ్ బాబు, ముథోల్ సర్పంచ్ రాజేందర్, పీఏసీఎస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, ఎంపీటీసీ సరళ శ్రీనివాస్ గౌడ్, కోఆప్షన్ సభ్యుడు మగ్దూమ్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు ఎండీ ఫారుఖ్ అహ్మద్, మాజీ ఏఎంసీ చైర్మన్ ఆసిఫ్, భైంసా మార్కెట్ కమిటీ డైరెక్టర్ రవి, నాయకులు సమిఉల్లాఖాన్, బాబన్న రవీందర్ రెడ్డి, కిష్టయ్య సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

### బతుకమ్మ చీరెల పంపిణీ ..

భైంసాటౌన్, అక్టోబర్, 6 : దేగాం పంచాయతీ భవనంలో ఎమ్మెల్యే విఠల్ రెడ్డి మహిళలకు బతుకమ్మ చీరెలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీరెలకు వెల కట్టవద్దని, చీరెలు గౌరవానికి ప్రతీకలని అన్నారు. సర్పంచ్ బొబ్బిలి శ్రీనివాస్, వార్డు సభ్యుడు గోవర్ధన్ రెడ్డి, ఎంపీటీసీ మాణిక్, ఎంపీవో మోజమ్ హుస్సేన్, కార్యదర్శి భోజన్న పాల్గొన్నారు.